అడల్ట్స్ ఓన్లీ కథ



# రసావిష్కరణ

'పరుజూచున్, వరుజూచున్ నొంపనలరింప రోషరాగోదయ విరతభ్రుకుటి మందహాసం వీరంబు శృంగారం..' మహాభాగవతం నరకాసుర ఘట్టంలోని పద్యమది.

శ్రీవల్లిని చూస్తుంటే, చటుక్కున గుర్తొస్తుంది శ్రీధరానికి. ఎందుకో తెలుసుకోవాలనుకుంటే ఈ కథ చదివితీరాల్సిందే.

★ ★ ★

శ్రీధరం, శ్రీవల్లిని తొలిసారి చూసింది పోలీస్ స్టేషన్‌లో.

అది-వన్ టౌన్ పోలీస్ స్టేషన్. ఓ క్షణం భయం వేసింది. జీవితంలో ఎప్పుడూ అందులోకి అడుగుపెట్టలేదతడు.

''నమ్మిన ఆ భగవంతుడే అన్నీ చూసుకోవాలి'' అనుకుంటూ అడుగులు ముందుకు వేసాడు.

''ఎవరు కావాలండీ?'' కానిస్టేబుల్ ప్రశ్న.


తడబడుతూ అన్నాడు శ్రీధరం ''శ్రీవల్లి''

కాస్తంత మొరటుగా అదే కానిస్టేబుల్ మళ్లీ ప్రశ్నించాడు. ''ఏం పని?''

''ఆమెని చూడాలి''

ఎగాదిగా చూసాడతడివంక కానిస్టేబుల్. ఆ చూపులో 'మీరేమవుతారనే' ప్రశ్న కనిపించింది శ్రీధరానికి.

ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో తెలియక కాసేపు తికమక పడ్డాడు శ్రీధరం. అసలే, ఖాకీలంటే వళ్లంతా వణుకే. వాళ్లతో డీల్ చేయడం తన డిక్షనరీ లోనే లేదు. ఊరుకాని ఊరులో, భాషకాని



పి.వి.డి.ఎస్.ప్రకాష్

పోలీస్ భాషతో మాటలకు తడబడుతున్నాడు శ్రీధరం.

''చెప్పండి సార్! ఆమెకు మీరేమవుతారో?'' కాస్తంత కరుకుగానే అడిగాడు కానిస్టేబుల్. ఎకాఎకి పోలీస్ స్టేషన్‌కే వచ్చి, ధైర్యంగా పేరడుగుతూనే దర్జాగా నిలిచిన అపరిచితుడి ధోరణి కానిస్టేబుల్‌కి అంతుపట్టడం లేదు. గట్టిగా పోలీస్ ప్రతాపం చూపిద్దామంటే ఎస్పీదొరగారు లోనున్నారాయే. అడకత్తెరలో పడ్డాడు కానిస్టేబుల్.

ఇంతలో ''నారాయణా! మొన్న జరిగిన చోరీకి సంబంధించిన ఫైల్ ఎక్కడుందో కాస్త చూసివ్వు, ఎస్పీగారు రివ్యూ చేస్తారట'' అంటూ అటుగా వచ్చిన లేడీ పోలీస్ కొత్త వ్యక్తిని చూసి ఖంగు తింది.

''అమ్మయ్యా! మీరే వచ్చారా? ఇంకా మీకోసం కబురు పెడదామనుకుంటున్నాను.



## రూటుమారింది

**అవును, అమీషాపటేల్ తన రూట్‌ని మార్చేసుకుంటోంది. బాలీవుడ్‌నించి టాలీవుడ్‌కి తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న అమీషాపటేల్ తెలుగు సినిమాలో నటిస్తోంది. ఈ సినిమా షూటింగ్ కోసం ఆమె స్విట్జర్లాండ్ కూడా వెళ్లి వచ్చింది. ఇదిలా ఉంటే ఈమెతో పాటూ ఈ చిత్రంలో సెక్సీ తార సమీరారెడ్డి నటిస్తోంది. అన్నట్టు ఈ చిత్రంలోని ఓ ఐటెం నెంబర్ సాంగ్‌లో సమీరా తన అందాల్ని ఒలకబోయనుందిట. అటు అమీషా, ఇటు సమీరాల కాంబినేషన్‌లో ఈ సినిమా జనాన్ని ఎలా రక్తికట్టిస్తుందో చూడాలి మరి!**

ఇదిగో! ఇతగాడెవరో, వివరాలు చెప్పలేదు. మీకోసం వచ్చారు'' అంటూ తన పనైపోయినట్లుగా అక్కడ్నుంచీ చల్లగా జారుకున్నాడు కానిస్టేబుల్.

ఇప్పుడు ఎదురెదురుగా వారిద్దరే.

''మీరూ..'' మొదటగా తేరుకున్న శ్రీవల్లి అందా మాటల్ని.

''నాపేరు శ్రీధరం'' అన్నాడు శ్రీధరం తడబడుతూనే.

కనీసం ముఖ పరిచయమైనా లేకున్నా ఆ పేరు వినగానే శ్రీవల్లికి అంతా అర్థమైపోయింది.

''మీరు..మీరిక్కడికి''

''మిమ్మల్ని చూడాలనే వచ్చాను''

''ఎస్పీగారు స్టేషన్ ఇన్‌స్పెక్షన్‌కి రావడం-స్టాఫ్ తప్పనిసరిగా అటెండ్ కావాలనే షరతు కారణంగా సాయంత్రం ఆ కార్యక్రమానికి హాజరు కాలేకపోయాను. క్షమించండి. మిమ్మల్నిలా ఇబ్బంది పెట్టినందుకు'' తడబడుతూనే అంటోందా మాటల్ని శ్రీవల్లి.

''ఇట్స్ ఓకే. ఇంతదూరం వచ్చి మిమ్మల్ని చూడకుండా తిరిగి వెళ్లకూడదనుకుని, కూడదని తెలిసినా ఇక్కడికి రాక తప్పలేదు. రేపు ఆఫీస్‌కి తప్పనిసరిగా అటెండవాలి. సెలవు లేదు'' చెప్పాడు శ్రీధరం.

''నిలబడే మాట్లాడుతున్నారు. రండి. ఇలా కూర్చుందురుగానీ'' అంటూ ఆహ్వానించిందామె.

ఫర్వాలేదంటూనే ఆమెని అనుసరించాడు శ్రీధరం.

శ్రీధరం కూర్చున్నాక ''వన్ మినిట్'' అంటూ లోనికెళ్లింది శ్రీవల్లి.

పోలీస్ స్టేషన్‌లలో పెళ్లి వార్తలను గతంలో పేపర్లలో చదివాడు శ్రీధరం. ఇప్పుడు తానిలా అటెండ్ కావడం చిత్రంగా ఉందతడికి. నిజానికి, పెళ్ళిచూపుల తంతు ఇంటిదగ్గరే ఏర్పాటు చేయడంతో ముందుగా అక్కడికే వెళ్లాడు శ్రీధరం. శ్రీవల్లి తల్లితండ్రులు ఆప్యాయంగా స్వాగతం చెప్పారు. కాఫీ, టిఫిన్‌లు అమర్చారు. ''అమ్మా, నాన్నా బాగున్నారా?'' అడిగారు. ఆ ఒక్క ప్రశ్నే కాదు..అలాంటి మరెన్నో ప్రశ్నలు అడిగారు. లోకాభిరామాయణం అంటారే..అలా అన్నమాట. లక్ష యక్ష ప్రశ్నలకు తోచిన సమాధానం ఇస్తూనే, ముఖం మీద కాస్తంత చికాకు పులుముకుని పరంధామయ్య వంక చూసాడు శ్రీధరం. భావం అర్థం చేసుకున్న ఆయన హుటాహుటిన ఫోన్ దగ్గరికి వెళ్లి ఏవో నంబర్లు కలిపి అవతలి సమాధానం కోసం ఆత్రుతగా నిరీక్షించసాగాడు. ఎప్పటికీ రెస్పాన్స్ లేకపోయేసరికి దిగాలు పడినవాడిలా పోజిస్తూ తిరిగి తన కుర్చీలో ఆసీనుడయేవాడు. ఆఖరికి లేడీ పోలీస్‌గా పనిచేస్తున్న పెళ్లికూతురు ఇంట్లో లేదని, అర్జంటుగా ఎస్పీ ఇన్‌స్పెక్షన్‌కి వస్తే స్టేషన్‌కి వెళ్లిందనే విషయం తెలిసింది. పెళ్లిచూపుల ఏర్పాట్లు మీరు కానివ్వండి నాన్నా! ఎస్పీ దొరగారి పర్మిషన్ తీసుకుని నే వస్తానంటూ పెళ్లికూతురు అన్నమీదటే పిల్లలేని ఇంట్లో పెళ్లిచూపుల తంతు జరిపించేస్తున్నారు. అసలు విషయం తెలీని శ్రీధరం అమాయకంగా కదిలే కర్టెన్ల చాటుకు తొంగి చూస్తూ, ఈ కాసేపట్లోనో, ఇంకా సేపట్లోనో లేని పెళ్లికూతురు రాకకోసం ఎదురుచూపులు చూస్తూ ఆశగా ఊహల్లోకాల్లో తేలిపోతూ వచ్చాడు. తానొక్కడే వచ్చాడు కానీ, తల్లిదండ్రులతో వస్తే ఈ కార్యక్రమం ఎంత అభాసుపాలయేది? అందులో, తన తండ్రి ఇలాటి కార్యక్రమాల్లో ఏమాత్రం లోపం జరిగినా అగ్గిమీద గుగ్గి

లమే అవుతాడాయే.

ఆలోచిస్తూనే తదుపరి కార్యక్రమంపై దృష్టి సారించాడు శ్రీధరం. ఫలితం, వేదిక మారిన 'పెళ్లిచూపులు'.

చిరునామా తెలుసుకుని, తనంతట తానే ఇక్కడకు హాజరయ్యాడు.

ఇంతలో లోనుంచి శ్రీవల్లి వచ్చిందక్కడికి. సరిగ్గా అప్పుడే చూసాడు శ్రీవల్లిని శ్రీధరం. మడత నలగని ఖాకీ డ్రస్‌లో ఉందామె. మంచి హైట్. శిరసుపై టోపీ. చేతిలో లాఠీ. ఇనుప నాడాల బూట్ల సవ్వడి.

శ్రీధరం వేపు తిరిగి ''రండి, ఇంటికి వెడదాం-'' ఆహ్వానించింది. 'అబ్బే! ఇక్కడ ఒక ర్వౌకరం చూసేసుకున్నాం కదా! సరదాగా ఏ హోటల్‌కో వెళ్ళి కాఫీ తాగేసి, కాస్తంత అభిప్రాయాలు ఇచ్చిపుచ్చుకుని సెలవు పుచ్చుకుందాం' అనాలనుకున్నాడు శ్రీధరం. ఏదో మొహమాటం పెదవి నుంచి మాటని బయటకు రానివ్వలేదు. ఏం చెప్పకుండా అలా స్థాణువులా నిలుచుండేసరికి మళ్ళీ రమ్మని ఆమె బలవంతం చేయడంతో తప్పనిసరిగా అంగీకరించాల్సి వచ్చింది.

ఇద్దరూ బయటకు రాగానే, అక్కడే సిద్ధంగా ఉన్న పోలీస్ జీపు ఆహ్వానం పలికింది. అదే వాహనంలో ఇద్దరూ ఆమె ఇంటికి బయలుదేరారు. తొలిచూపులు పోలీస్ స్టేషన్‌లో, తొలిప్రయాణం పోలీస్ జీపులో.. అదో కొత్త అనుభవం శ్రీధరానికి, తలుచుకుంటే అతడికి నవ్వాగడం లేదు. కొసమెరుపేమిటంటే, అంతరాత్రివేళ, అదే ఖాకీడ్రస్సులో శ్రీవల్లి ఉండగానే 'పెళ్లిచూపుల' తంతు అయిందనిపించడం.. అంతే!

'ఎక్కడుందో తెలీని మరో తన సగం కోసం వెతుక్కోవడమే జీవితం-' అన్న మాటలు పదే పదే గుర్తుకొస్తున్నాయి శ్రీధరానికి. చదువైపోయి, హైదరాబాద్‌లోని ఓ కార్పోరేట్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించినది మొదలు, ఎజెండాలోకి 'పెళ్లి' అనే అంశాన్ని పెద్దలు ప్రముఖంగా చేర్చడంతో పదే పదే అదే చర్చ. ఏకాంతంలోనూ ఎప్పటికీ కనిపించని ఆ కాంతకు ఆహ్వానపూర్వకంగా చేసే 'చందన చర్చ'తో ఏడువారాలు ఏడు వర్జ్యాల సమ్మిళితంగా కాలక్షేపం చేస్తున్నాడు శ్రీధరం. అడపాదడపా పోస్ట్‌లో తల్లిదండ్రులు పంపించే ఫోటోలు చూడడం, వీలయితే, కుటుంబ సభ్యులతోనో, లేకుంటే తానొక్కడే వెళ్లి పిల్లను చూసి రావడం... లాంటి కార్యక్రమాలతో కాలక్షేపమయ్యేది. కేవలం, ఈ ధ్యాసలో పడడంతో క్రమక్రమంగా హైదరాబాద్ బ్రహ్మచారి బతుకులో చరిస్మా లేకుండా పోయింది శ్రీధరానికి. దేవీ మెస్ వడ్డించే సాంబారు మెతుకులు తిని, తిని నోటి రుచి చచ్చిపోయింది. అమ్మపెట్టే ఆవకాయ రుచి అప్పుడప్పుడూ గుర్తొస్తున్నా, అంతకు మించిన నవకాయ పిండివంటల రుచి కోసం మనసు తహతహలాడేది. సొంతంగా తాళాలు తెరుచుకుని రూంలోకి వెళ్ళగానే మాట్లాడేందుకు మరొకరు లేని జీవితం నిస్సారంగా తోచేది. అర్ధరాత్రి వేళలో ఆదమరచి నిదురలో కళ్ళను వరించి వచ్చిన కలలో మంద్రంగా మోగే మట్టెల సవ్వడి, మంత్రించే గాజుల సంగీతం ప్రతిధ్వనించేవి. అంతేనా! తెల్లచీరలో, శిగలో సన్నజాజులు తురుముకుని, పరిసరాల్లో పరిమళాలు వెదజల్లుతూ నడయాడే అజ్ఞాత సుందరి కలవరపరిచేది. దాంతో, నిదుర కరువైపోగా చటుక్కున పక్కనుంచి హుటాహుటిన లేచి, అందిన పెళ్లికూతుర్ల ఫోటోలు, తన ఫోటోలు పక్క పక్కన పెట్టుకుని అలా చూస్తుండిపోవడం ఇంచుమించు దినచర్యగా అయిపోయింది.

ఆ క్రమంలోనే శ్రీవల్లిని చూసాడు శ్రీధరం. సాధారణంగా, ఏ పెళ్ళిచూపులకైనా వెళ్లి వచ్చినవాడు, శ్రీధరాన్ని దానికి సంబంధించిన ఆలోచనలు వెన్నాడుతుండేవి. బీచిలో ఇసుకతిన్నెలపై చేతిలో చేయి వేసుకుని ఇద్దరూ కలిసి నడిచే కల తప్పనిసరిగా శ్రీధరానికి వచ్చే కల. అలాగే, పార్కులో పదిమంది మధ్య ఉన్నా, ఎవరూ చూడకుండా 'దొంగముద్దు' దోచేస్తున్నట్టు మరో కల. మలేషియా, మారిషస్‌లలో యుగళగీతాలు పాడుకుంటున్నట్లు కూడా అప్పుడప్పుడు కలలు రావడం మామూలే. తాళి కట్టేది ఒకరితోనే అయినప్పుడు, ఇలా చూసిన ప్రతి ఒక్కరితో కలలు కనడం సబబా? అని ఎవరైనా ప్రశ్నిస్తే, శ్రీధరం దగ్గర రడీగా సమాధానం ఉండేది. ''నూరేళ్ళపాటు జీవితం సాగించేందుకు భాగస్వామిని ఎంచుకోవడంలో, ఇలాంటి ఊహలు, వ్యూహాలు తప్పని సరే.. ఎదురుగా ఉన్నా లేకున్నా.. ఆమె మనసుపై ఏమాత్రం ముద్ర వేసిందనే అంచనాకు రావడమే, ఆ కలలకున్న ప్రాధాన్యత..'' అంటాడు శ్రీధరం.

అలా కలలు కనే శ్రీధరానికి, శ్రీవల్లి కూడా అనేక భంగిమల్లో



## అదృష్టం

**సినిమా అవకాశాలు లేక తెగ ఇబ్బంది పడుతున్న తారలకి ఒకే డైరెక్టర్ నుంచి రెండు మూడు ఆఫర్లు వస్తే ఎలా ఉంటుంది? ఆయేషా టాకియా పరిస్థితి ఇప్పుడలాగే ఉన్నట్టుంది. 'దిల్ మాంగె మోర్', 'సోచా నా తా' చిత్రాల్లో మంచి పెర్‌ఫార్మెన్స్‌ని సొంతం చేసుకున్న ఈ భామ రాంగోపాల్‌వర్మ రెండు చిత్రాల్లో నటించే ఛాన్స్ కొట్టేసింది. ఇంకో సినిమా డేట్స్ ఇంకా పూర్తికాలేదంటోంది ఆయేషా. ఈ సంగతే ఆమెని అడిగితే 'నిజమే. కొన్ని సినిమా ఆఫర్లు అనుకోకుండా వస్తాయి. వర్మ సినిమాల్లో ఇలా ఒకేసారి ఆఫర్లు నాకు రావడం, సీనియర్ దర్శకుడితో కలిసి పనిచేయడం నా అదృష్టం' అని హేపీగా చెబుతోంది.**

దర్శనమిచ్చింది. అయితే, అన్ని కలలలోనూ మారని రెండింటి కారణంగా శ్రీధరం ఉలిక్కిపడేవాడు. ఆ మారని ఆ రెండూ డ్రస్సూ, అడ్రస్సూ. ఇంకా విడమర్చి చెప్పాలంటే, ఖాకీ డ్రెస్సు, పోలీస్ స్టేషన్.. అన్నమాట. ఆ స్టేషన్ ఆవరణలో, లాఠీ ఊపుతూ, టోపీ తీస్తూ, ఇనుప నాడాల బూట్లను టకటకలాడిస్తూ, ఒక్కోసారి లాకప్‌లో ఖైదీని చితకబాదుతూ... ఇలా ఎన్నెన్నో విధాలుగా దర్శనమిచ్చేది శ్రీవల్లి. అలాంటివేళల్లో, శృతి తప్పి లాకప్‌లో ఖైదీ బదులుగా శ్రీధరం రూపాన్నే చూపించేది ఓ మెరుపు కల.

దాంతో, భయవిహ్వలుడై ఏ తెల్లవారుఝామునో లేచేవాడు. ఆ తర్వాత అతగాడికి నిద్ర పడితే ఒట్టు.

★ ★ ★

సెల్‌ఫోన్ రింగైంది. అన్‌నోన్ నంబర్. 'ఎవరై ఉంటారా?' ఆలోచిస్తూనే కాల్ రిసీవ్ చేసుకున్నాడు శ్రీధరం.

''హలో! శ్రీధరంగారా!'' అవతల్నుంచి లతా మంగేష్కర్ కంఠధ్వనితో పలకరింపు.

''నేనే మాట్లాడుతున్నాను.''

''గుర్తుపట్టారా? నేనండీ..'' చెబుతుండగా పక్కనుంచీ పెద్ద సౌండ్‌తో వెహికిల్ వెళ్లడంతో ఆమెపేరు వినిపించలేదు శ్రీధరానికి. మళ్లీ అడగడానికి మొహమాటపడ్డాడు.

ఇంతలో ఆ అమ్మాయి మరింత చనువుతో అడిగింది. ''ఇవాళ మీ ప్రోగ్రామ్ ఏమిటి? మిమ్మల్ని కలుసుకొనే అవకాశమిస్తారా? ఎక్కడ మిమ్మల్ని కలవొచ్చు'' వరుసగా ప్రశ్నల వర్షం కురిపిస్తోందామె.

''ఆగండాగండి. ఏ అష్టావధాని కూడా అన్ని ప్రశ్నలు గుర్తుంచుకుని సమాధానమివ్వలేడు. అర్భకుడిని. నన్నిబ్బంది పెట్టకండి. తప్పకుండా కలుద్దాం. సాయంత్రం వీలవుతుందా?'' అడిగాడు శ్రీధరం.

''రెండ్రోజుల సెలవుమీద ఈ ఊరొచ్చాను. ఇరవై నాలుగ్గంటలూ ఫ్రీయే. అలాగని, ఏ అర్ధరాత్రో, అపరాత్రో రమ్మని పిలవకండి. అసలే ఆడపిల్లని..'' అందామె.

''మీరు మా బాగా మాటాడతారు. మీరుండేది మాసాబ్‌ట్యాంక్ దగ్గర కదా! మినర్వా రెస్టారెంట్ కొత్తగా వెలసిందక్కడ. 'మెనూ!' బాగుంటుందట. మా ఫ్రెండ్ చెప్పాడు. కలిసి టిఫిన్ చేద్దాం. సరేనా?'' అన్నాడు శ్రీధరం.

''సాయంత్రమెప్పుడవుతుందా, మీరెప్పుడొస్తారా అని ఆశగా ఎదురుచూస్తుంటాను. బై''

ఆమె ఫోన్ సంభాషణ అయిందని తెలిసాక అప్పుడు అడగాలనుకున్నది అడగలేదని అర్థమైంది శ్రీధరానికి. ఇంతకీ ఆమె ఎవరో? పేరేమిటో? ఊరేమిటో? అసలు, సాయంత్రం ఆమెనెలా గుర్తించడం? ఆమె స్వయంగా ఫోన్ చేసి కలుద్దామని ఆహ్వానిస్తే, కనీసం పోల్చుకోలేని పరిస్థితిలో తనున్నాడా? బాధపడుతున్నాడు శ్రీధరం. సెల్‌లో ఇన్‌కమింగ్ కాల్స్‌లో రికార్డయిన నంబర్‌కి ఫోన్ చేసి మళ్లీ ఆమె పేరడుగుదామనేంత ఆవేశమొచ్చినా బలవంతంగా ఆపుకున్నాడు. అన్యమనస్కంగా పనిచేస్తూనే, ఎలాగో సాయంత్రమైందనిపించాడు.

ఆఘమేఘాల మీద మినర్వా రెస్టారెంట్‌కి చేరుకున్నాడు. హాలంతా కిటకిటలాడుతూ ఉంది. ఆమెకోసం చూపుల గాలం వేసాడు శ్రీధరం. కనిపించలేదు. అయిదు నిముషాలు, పది నిముషాలు, పదిహేను నిముషాలు.

ఆమె రాలేదేమో? ఇక వెళ్లిపోదామనుకుని వెనక్కి తిరుగుతుండగా ''హలో'' అన్న తీయని కంఠం వినిపించింది. చటుక్కున చూసాడు పిలుపు వినవచ్చిన దిశకు.

అజంతా శిల్పానికి చీరకట్టినట్లు హొయలొలుకుతూ వయ్యారంగా నిలుచుందామె. తను వచ్చినదగ్గర్నుంచీ ఆమెని చూస్తున్నాడు. కానీ..పోల్చుకోలేదు. ఆమె తననే చూస్తూ పలకరింపుగా నవ్వింది. కాటుకలద్దిన కళ్లతో 'రారమ్మ'ని ఆహ్వానించింది. ఆ ఆహ్వానం రతీదేవి మన్మథుడికి పంపిన శుభాహ్వానంలా తోచింది శ్రీధరానికి. 'తననేనా?' ఇంకా నమ్మలేకపోతున్నాడతడు. దగ్గరికి వెళ్లి అనుమానంగా చూసాడు. ''హలో! నన్నింకా గుర్తుపట్టలేదా'' అల్లరిగా అడుగుతుందామె. ''ఊహూ! గుర్తుపట్టలేదు. మీరేనా?'' అన్నాడు శ్రీధరం.

''అవును. నేనే..మీరు మరిచిన శ్రీవల్లిని'' అందామె.

ఆశ్చర్యంగా ఉంది శ్రీధరానికి.

ఖాకీ డ్రెస్సులో ఇన్ని వంపులెక్కడెక్కడ దాచేసిందో మరి, ఈరోజు షిఫాన్ చీరలో మూటగట్టుకుని తుఫాన్ సృష్టించేందుకు వచ్చినట్లుంది.

''ఇదే మన టేబుల్. పొద్దున మీరు చెప్పగానే రిజర్వ్ చేయించాను. నిజంగా, మీరు చెప్పిందాని కన్నా చాలా బాగుందీ రెస్టారెంట్. ఏకాంతంగా కూర్చుని ఎన్ని కబుర్లు ఎన్ని గంటలైనా చెప్పుకోవచ్చు'' అంటూ తను కూర్చుంటూనే, కూర్చోమన్నట్లుగా సైగ చేసింది. సంకేతం అందుకుని శ్రీధరం కూడా కూర్చున్నాడు.

''పొద్దున్న అంత బాగా మాట్లాడారు. గుర్తుపట్టకుండానే, అలా మాటాడారా?'' అడుగుతోంది శ్రీవల్లి కొంటెగా.

సమాధానం చెప్పకుండా అలాగే చూస్తున్నాడు శ్రీధరం. అది గమనించిన ఆమె బుగ్గలు ఎరుపెక్కాయి. పెళ్లి చూపులనాడు కనిపించని అందాలు ఇప్పుడామెలో చూస్తూ తన్మయత్వానికి లోనవుతున్నాడు. బ్రహ్మదేముడు కూడా 'మిస్ వరల్డ్' పోటీలకు పంపించాలనే రొమాంటిక్ ఊహతో కాబోలు, ఈమెని సృష్టించాడేమో? అనుకున్నాడు శ్రీధరం. ఖాకీ డ్రెస్‌లో శరీరాన్ని దూర్చేసి, చేత్తో లాఠీ ఊపుకుంటూ, మగరాయుడిలా తిరిగే ఆమెలో ఇంత సౌందర్యముందా? ఎంతగా ప్రశ్నించుకున్నా ఆశ్చర్యమే సమాధానమవుతోందంతే.

పచ్చని శరీర ఛాయ, నల్లని కురుల్లో పొందికగా అమరిన పరిమళాలు వెదజల్లే మల్లియ, మరువాలు, కాటుకలద్దిన కళ్లు, నక్షత్రాల్లా మెరిసే చూపులు, గులాబీ అధరాల, చామంతుల చెక్కిళ్లు, శంఖాకారపు మెడ, ఆ మెడ వంపులో చిక్కుకునే అదృష్టానికి కించిత్ గర్వంతో మెలికలు పోతున్న సన్నని బంగారపు గొలుసు.

శ్రీధరం చూపులెక్కడ చిక్కుకున్నాయో పసిగట్టలేని అమాయకురాలేం కాదు శ్రీవల్లి. అందుకే, అతడి దృష్టిని మరల్చేందుకు-

''మాటలు రాని మౌనిలా ఎప్పుడు తయారయ్యారు?'' అని ప్రశ్నించింది.

'ఇప్పుడే, నిన్ను చూసాకే..' అందామనుకుని, మొహమాటం అడ్డొచ్చి ఆగిపోయాడు.

ఇంతలో బేరర్ ఆర్డర్ తీసుకోవడానికొచ్చాడు. శ్రీధరం రుచులు, అభిరుచులు అడుగుతూనే ఆర్డర్ చేసింది శ్రీవల్లి.

''ఎప్పుడూ కేసులు, ఖైదీలు, బేడీలు, సెక్షన్లు, కోర్టులు...నేరాలు, ఘోరాలతో విసిగిపోయాను. నిజానికి, జీవితంలో అత్యంత విలువైన పెళ్లిచూపుల తతంగాన్ని కూడా వృత్తిబాధ్యత డామినేట్ చేసింది. ఆరోజు మీరు కూడా స్టేషన్‌కి వచ్చే స్థితి నెలకొందంటే మీరర్థం చేసుకోండి. అందుకే, ఆరోజు మిస్సయిన 'పెళ్లిచూపుల'ను నాకు నేనే అరేంజ్ చేసుకుని ఇదిగో, ఇలా చీరకట్టులో వచ్చాను'' అంతలోనే-



''ఇలా వచ్చానని తప్పుగా అర్థం చేసుకోకండి. కుటుంబ బాధ్యతలు, ఆర్థిక సమస్యలు, ఇతర కారణాల వల్ల ఇంతవరకూ పెళ్లి ప్రయత్నాలు చేయలేదు. చేయడం ప్రారంభించిన తర్వాత నాకొచ్చిన, నే మెచ్చిన మొదటి సంబంధం మీదే. మిమ్మల్ని స్టేషన్‌లో చూసిన తొలి క్షణంలోనే నాకు నచ్చారు. మొదటి చూపులో 'ప్రేమ' మీరు నమ్ముతారో లేదో నాకైతే తెలీదు. కానీ, అది ప్రేమైతే నేనూ ప్రేమలో పడ్డాను. అదీ, పెళ్లిచూపుల్లోనే ప్రేమలో పడ్డాను. మొదటిసారిగా మీకే ఆ విషయం చెప్పాలనిపించి ఇలా వచ్చాను. నేనిలా మిమ్మల్ని కలుస్తున్నట్లు మావాళ్లెవరికీ తెలీదు. ఇప్పుడే కాదు, మరెప్పుడూ తెలీదు. నచ్చితే పెళ్లి పీటల మీద కలుసుకుంటాం. నచ్చకుంటే, ఇదిగో ఈ హోటల్లో కలిసిన జ్ఞాపకాలను గుండెల్లో దాచుకుని శాశ్వతంగా విడిపోతామంతే.'' శ్రీవల్లి ఎంత ఉద్వేగంతో ఆ మాటలంటోందో అర్థం చేసుకున్నాడు శ్రీధరం. నిజానికి, కరకు ఖాకీ బట్టల్లోనే శ్రీవల్లిని చూసాడు తను. పాంట్, షర్ట్ తోపాటు ప్రొఫెషన్‌కి సంబంధించిన కాస్తంత కరకుదనం కూడా ఆమెలో అప్పుడు చూసాడు. కానీ, ఇప్పుడు ఆమె హృదయాన్ని ఈరోజు తన ముందు ఆవిష్కరించడం అతడికెంతో నచ్చింది. ఒక ఆడపిల్ల తనంతతానుగా వచ్చి, ఇలా మనసును బయటపెడితే విన్న మగవాడెంత అదృష్టవంతుడో ఆ క్షణం శ్రీధరాన్ని చూస్తే ఇట్టే తెలుస్తుంది.

★ ★ ★

'శ్రీవల్లి వెడ్స్ శ్రీధరం'- చామంతిపూల రేకులతో సింగారించిన స్వాగత బేనర్ ఆహూతులను విశేషంగా అలరిస్తోంది. కళ్యాణమేళాలు, కర్పూర సుగంధాల సాక్షిగా శ్రీధరం, శ్రీవల్లి మెడలో తాళి కట్టాడు. ఆత్మీయులంతా అరుదెంచి ఆశీస్సులాక్షింతలు మనసారా వధూవరుల శిరసున గుమ్మరించారు. ఇక ఒకేమాట, ఒకే బాట, ఒకే గమ్యంగా సాగిపోతూ 'సహజీవనం' సాగించాల్సిందిగా బంధుజనం ఆకాంక్షించారు. రెస్టారెంట్‌లో కలిసిన వారం తర్వాతే, ఈ పెళ్లి పనులు చకచకా జరిగిపోవడం, చూస్తూండగానే దంపతులైపోవడం జరిగిపోయింది.

ఆ రాత్రి, తొలిరాత్రి. ఇంతకుముందు ఎన్ని రాత్రులో విచ్చేసినా, వారిద్దరి జీవితాలను ఏకం చేస్తూ 'ఒకరికొకరు'మనే భావనను రుజువుచేస్తూ అరుదెంచిన రాత్రి, శోభన రాత్రి.

గదిలో ఒక్కడే కూర్చున్నాడు శ్రీధరం. ఎదలో కొలువుతీరిన దేవత రాకకోసం వళ్లంతా కళ్లు చేసుకుని మరీ ఎదురుచూస్తున్నాడతడు. అలంకృత పందిరి మంచం ఎన్ని తరాలకు సాక్షిగా ఉందో? మరో కొత్త జంట పవళింపు వేడుకకోసం సంసిద్ధంగా ఉంది. మల్లెలు, మరువాలు పరిసరాల్లో పరిమళాల తుపానులు సృష్టిస్తున్నాయి. అగరొత్తుల ధూపం వయారాలు పోతోంది. దేవిగారి రాకకోసం ఆశగా, ఆత్రుతగా నిరీక్షిస్తున్నాడు శ్రీధరం.

క్షణాలు యుగాలవడమేమిటో ఇప్పుడతడికి అర్థమవుతోంది. పురోహితుల మంగళాశీస్సుల నడుమ శ్రీవల్లి నెమ్మదిగా కదిలివచ్చింది. గదిలోకి ఆమెని తోసిన వెంటనే పెద్ద ముత్తయిదువులు కిలకిలా నవ్వులు రువ్వుతూ వెళ్ళిపోయారక్కడనుంచి.

తెల్లచీర, పాల్గ్లాసుతో లోనికి అడుగుపెట్టిన శ్రీవల్లి అక్కడే నిలుచుండిపోయింది.

చేతులు రెండూ సాచి సాదరంగా ఆహ్వానించాడు శ్రీధరం. చిర్నవ్వులు చిందిస్తూ నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ కదిలింది కలహంస మాదిరిగా ఆమె.

ఆ ఏకాంత మందిరంలో వారిద్దరే.

''శ్రీ...నేనెంత అదృష్టవంతుడినో కదా! నువ్వు ధైర్యం చేసి రాకుంటే నిజం చెబుతున్నా..నిన్ను నే పెళ్లాడేవాడిని కానేమో? అందుకే, అయిదు నిముషాల 'పెళ్లిచూపులు' కాదు కావలసింది, అయిదు నిముషాల ఏకాంతం. పెద్దలనెదిరించి ప్రేమించుకున్నా మనదీ 'ప్రేమపెళ్లి' అని చెప్పుకునేందుకు ఆ తరహా ఏకాంతం అవసరం.

అభిప్రాయాలు ఇచ్చిపుచ్చుకోవడానికి ఆ సమయం చాలు. పదిమంది ముందూ పాటొచ్చా, పద్యమొచ్చా అని ప్రశ్నలడిగి పెళ్లికూతుర్లను సతాయించే బదులుగా, ఓ అయిదు నిముషాలు పెళ్లి చేసుకోబోయే ఆ ఇద్దరే కూర్చుని మనసు విప్పుకుని సంభాషిస్తే సయోధ్య కుదిరినట్లే'' ఆవేశంగా చెబుతున్నాడు శ్రీధరం.

''అయ్యా! ఆపుతారా, మీ స్తోత్ర పాఠాలు, ఎవరికో మార్గదర్శకం కోసం నే రాలేదానాడు. నాకు మీరు నచ్చారు. 'మీకు నేను నచ్చానా?' అని తెలుసుకునేందుకు వచ్చాను. అదృష్టవశాత్తూ నే నచ్చాను కాబట్టి అంతా సుఖాంతమే అయింది. లేకుంటే, చేసిన ఆ ధైర్యానికి బరితెగింపనే పదం తోడై నా జీవితం మీదే చెరగని ముద్ర వేసేదేమో? ఇప్పుడు తలుచుకుంటే గుండె గుభేలంటోంది'' అంది శ్రీవల్లి. తర్వాత ఏం చేయాలో తోచని స్థితి. ఎక్కడనుంచి మొదలుపెట్టాలో తెలీని పరిస్థితి.

'ఒక సగం కోసం మరో సగం వెతుకులాటే జీవితం' అని ఎక్కడో చదివిన గుర్తున్నా ఎక్కడనుంచి ఆ వెతుకులాట ప్రారంభించాలనే సందిగ్ధం ఇద్దరిలోనూ.

తొలి స్పర్శ- ఒక విద్యుత్ ప్రకంపన.
తొలి కౌగిలింత- ఓ వింత పులకింత.
తొలి చుంబనం- ఓ పాలపుంత.

గోరంటాకు పెట్టినట్లు ఇద్దరి కళ్లలోనూ ఎరుపుదనం. మౌనం రాజ్యమేలుతున్నా ఇరువురి చూపులూ మహా ప్రబంధాలనే పఠిస్తున్నాయి. ఈ అంతులేని ప్రయాణం ఎటునుంచి, ఎటువేపు సాగుతుందో అర్థంకాని, అయోమయం నెలకొంది తడిలో. ఇది ఆరంభం మాత్రమే. భవిష్యత్ అంతా శోధిస్తూ, సాధిస్తూ ప్రయాణించాల్సిందే- అనుకున్నాడు శ్రీధరం. తర్వాత ఏ అర్థరాత్రివేళో పక్కనున్న చుక్కవంక చందురుడు ఒరిగి ఒరిగి కరిగిపోతుంటే, మాటలు తరిగి, మోమాటాలు కరిగి, కాస్తంత దగ్గరికి జరిగి, దేహాల సందేహాలు తీర్చుకునే పనిలో పడ్డారు వారిద్దరూ.

★ ★ ★

పెళ్లయినా, పోలీసుద్యోగం మానలేదు శ్రీవల్లి. భర్త పనిచేసే చోటుకే బదిలీ చేయించుకుందామె. తొందరగా ఆఫీసు షనైపోతే, భార్యకోసం ఆమె పనిచేసే పోలీస్ స్టేషన్‌కి వెళ్లేవాడు శ్రీధరం. ఒక్కోసారి, శ్రీవల్లి లాకప్‌లో ఏ నిందితుడినో ఉతికారేస్తూ కనిపించేది.

''ఏరా దొంగరాస్కెల్..చెప్పు, నువ్వా నేరం చేయలేదూ?'' కటువుగా అడుగుతూనే, అడపాదడపా లాఠీలకు పనిచెప్పేది. అలా వృత్తిధర్మం నెరవేరుస్తూనే, తన కోసం వచ్చిన భర్తవైపు అనురాగదృక్కులు ప్రసరింపచేస్తుండేది.

సరిగ్గా అప్పుడే శ్రీధరానికి తను చదువుకున్న 'నరకాసుర వధ' ఘట్టంలోని ఆ పద్యం గుర్తుకొచ్చేది.

'పరుజూచున్, వరుజూచున్ నొంపనలరింప
రోషరాగోదయ విరతభ్రుకుటి మందహాసం
వీరంబు శృంగారం..'

నరకాసురుడితో పోరాడుతున్న సందర్భంలో అటు శత్రువుని, ఇటు ప్రియవల్లభుడిని ఏకకాలంలో చూసే చూపుల్లోని వ్యత్యాసాన్ని చాలా చక్కగా వర్ణించాడు కవి.

ఓ కంట రోషం, మరోకంట అనురాగం, ఒకసారి భ్రుకుటి ముడవడం, మరోసారి పెదవులపై చిరుదరహాసం చిందించడం, శత్రువుతో పోరాడుతున్న వేళ వీర రసాన్ని ఆవిష్కరించడం, అదే సమయంలో మనసుకి నచ్చిన ప్రియనేస్తాన్ని చూస్తూ శృంగారం ఒలకపోయడం-

ఒక స్త్రీ ఒకే సందర్భంలో ఎన్నెన్ని విధలుగా 'రసావిష్కరణ' చేయగలదో...అలనాటి సత్యను వర్ణిస్తూ కవి సాహిత్యం నిక్షిప్తపరిచి సుస్థిరతను ఆపాదిస్తే, ఆధునిక మహిళ కూడా తానే విధంగా తీసిపోనంటూ నిరూపించుకోవడం నిజంగా హర్షించదగ్గ అంశమే.

శ్రీధరానికి శ్రీవల్లిని చూస్తుంటే కలిగే అనుభూతి అది. ఆ అనుభూతిని ఏ భవభూతి అక్షరీకరించగలడు?

☆